క్లుప్తంగా

పదవీ విరమణ పొందిన హౌసింగ్ ఏఈకి సన్మానం



శివరామ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్

పాముపాడు: మండలంలో హౌసింగ్ ఏఈగా బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ పొందిన శివరామకృష్ణారెడ్డిని బుధవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సన్మానించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హౌసింగ్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. విశ్రాంత జీవితాన్ని సుఖసంతోషాలతో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈ హౌసింగ్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణ అందరి బాధ్యత



సైకిల్‌ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాములపాడు: క్షయ వ్యాధి నివారణ అందరి బాధ్యత అని టీబీ సూపర్‌వైజర్లు రవికుమార్, మస్తానయ్య, సౌజన్య అన్నారు. బుధవారం మండలంలోని వేంపెంట గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూలు నుంచి చెంచు గూడెంలో విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గూడెంలో గిరిజనులకు క్షయ వ్యాధి గురించి వివరించి, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న మందులు, పౌష్టికాహారం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ భారతి, హెల్త్ అసిస్టెంటు రమణమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు పీహెచ్‌సీ వైద్యురాలిగా శ్రీజ

మహానంది: బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సవిత మెటర్నిటీ సెలవులో వెళ్లినట్లు వైద్యాధికారి భావన తెలిపారు. ఈ మేరకు నంద్యాల డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీజను డిప్యూటేషన్‌పై బండి ఆత్మకూరుకు నియమించినట్లు చెప్పారు. దీంతో బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారన్నారు.

నిత్యావసర వస్తువులు సబ్సిడీపై ఇవ్వాలి

నందికొట్కూరు: కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులు పేదలకు సబ్సిడీ కింద అందించాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి కోరారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరలను కేంద్రం తక్షణమే తగ్గించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు అమాంతంగా పెరగడంతో ప్రజలు కొనలేని దుస్థితి ఏర్పడిందని వాపోయారు. అనంతరం మున్సిపల్ కమిషన కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు రమేష్ బాబు, వీరస్వామి, షేక్షావలి, పోచయ్య పాల్గొన్నారు.

ఆర్‌బీకే ఛానల్‌పై అవగాహన కల్పించాలి

వెలుగోడు: ఆర్‌బీకే ఛానల్, మేగజైన్‌పై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.పవన్ కుమార్ సూచించారు. బుధవారం అబ్దుల్లాపురం, వేల్పనూరు, వెలుగోడు-1,2 రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రాల వద్ద ఆర్బికే ఛానల్ లో ప్రసారమయ్యే కార్యక్రమాలు, ఆర్‌బీకే మ్యాగజీన్ చందాదారుల జాబితాను ప్రదర్శించారు. వ్యవసాయ సహాయకులు అంజిత్ కుమార్ రెడ్డి, వెంకటకృష్ణ, వల్లి, స్వర్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

కొత్తపల్లి: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, మండలంలోని గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 103.8 వర్షపాతం నమోదయ్యిందని చెప్పారు. ఏ గ్రామంలోను సమస్య తలెత్తకుండా జాగ్రత్తగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఏమైన సమస్యలు వస్తే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రపంచ జ్యూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో గురువారం ఉచితంగా రెబీస్ టీకాలు వేయనున్నట్లు ఆత్మకూరు ఏడీఏ అరుణ బుధవారం తెలిపారు. ఏడీఏ మాట్లాడుతూ ఇళ్లలోకి ఇతరులు, బంధువులు వచ్చే సమయంలో పెంపుడు కుక్కలు దాడి చేసే అవకాశం ఉందన్నారు. దీంతో వారు గాయపడే అవకాశం ఉందని, ఈ గాయాల వలన ఆ వ్యక్తులకు రెబిస్‌సోకకుండా పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని సూచించారు.

గతంలో కౌలు కార్డుకోసం పలుమార్లు తిరగాల్సి వచ్చేది



నాపేరు రజాక్. మాది జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామం. గతంలో కౌలురైతు గుర్తింపు కార్డుకోసం ఎన్నిమార్లు దరఖాస్తు పెట్టుకొని, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఇచ్చేవారు కాదు. ప్రతిసారి మండలకేంద్రం జూపాడుబంగ్లాకు వెళ్లి రావాలంటే డబ్బు, సమయం ఖర్చు అయ్యేది. ఇప్పుడు పైసా ఖర్చులేకుండా వలంటీరు వచ్చి పేరు నమోదు చేసుకొని వెళ్లారు. మీటింగ్‌లో నాపేరు పిలిచి కౌలురైతు గుర్తింపుకార్డును ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది. దీనితో రాయితీ విత్తనాలు, ఎరువులు, రుణాలు పొంది సంతోషంగా వ్యవసాయం చేసుకొంటాను.

దరఖాస్తు చేసిన వెంటనే ధ్రువపత్రాలు మంజూరు చేశారు



నాపేరు అబ్దుల్ కరీమ్. నందికొట్కూరులోని వడ్డెపేటలో నివాసముంటాను. మాకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అడిగిన వెంటనే వలంటీర్లు తెచ్చిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వలంటీర్లు చెప్పడంతో వెంటనే అర్జీ పెట్టుకున్నాను. మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పేరు పిలిచి నాకు ధ్రువీకరణ పత్రం అందించారు. గత ప్రభుత్వంలో కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితేనే పనులు చేసే వారు. ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎలాంటి ప్రయాస లేకుండా ఒకే సారి కుల, నివాస, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు.

జన సంక్షేమానికి సురక్ష

- నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న క్యాంపులు
- లబ్ధిదారులకు ఎక్కడికక్కడే సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు
- ఇప్పటి వరకు 4,725 మందికి సర్టిఫికెట్లు పంపిణీ
- వ్యయప్రయాసలు తప్పాయని ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నందికొట్కూరు పట్టణంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, అధికారులు(ఫైల్)

నందికొట్కూరు: ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు, సేవలు ముంగిళ్లలోనే అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జనానికి వరంలా మారింది. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతగా కొనసాగుతోంది. ఈ నెల 1న మొదటి రోజు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, మండల స్థాయి అధికారులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు ఆయా పత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి సర్టిఫికెట్లును ఎమ్మెల్యే అందజేశారు. దరఖాస్తు చేసిన వెంటనే ఎవరి సిఫారసు లేకుండా ఉచితంగా సర్టిఫికెట్ అందడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం కూడా పలు మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

తొలిరోజు 3,125 మందికి సర్టిఫికెట్ల అందజేత

నియోజకవర్గంలో గత నెల 24న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిగిరి ప్రజలకు అవసరమైన పత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అందుకు సంబంధించిన టోకెన్లు అందజేశారు. అనంతరం దరఖాస్తులను సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు మంజూరు చేసిన పత్రాలను తొలిరోజు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 3,125 మందికి అందజేశారు. రెండోవ రోజు మంగళవారం 2, 225 మందికి అధికారులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం జూలై 30వ తేదీ వరకు కొనసాగుతుంది.

నేడు 'జగనన్న సురక్ష'

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లోని బుక్కాపురం, తమ్మడపల్లె గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్లు కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. కార్యక్రమాలలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని జైకిసాన్ పార్కులో 5, 6 వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహిస్తునట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. కార్యక్రమాన్ని సద్వినియోగం ప్రజలు చేసుకోవాలని కోరారు.

ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు భానుప్రకాష్, హరి, తరుణ్, మనోజ్ డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. సీబీఎస్ఈ సిలబస్, స్మార్ట్ టెక్నో ఒలంపియాడ్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ఒత్తిడి చేసి ఫీజులు వసూలు చేయడం దారుణమన్నారు. పాఠశాలలను బంద్ చేయిస్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ తరలించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆనంద్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి నాలుగు 108 వాహనాలు



జూపాడుబంగ్లా: నందికొట్కూరు నియోజకవర్గానికి నాలుగు నూతన 108 వాహనాలు మంజూరయ్యాయి. నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యాధునిక సౌకర్యాలున్న 140, 108 అంబులెన్స్‌లను ప్రారంభించారు. అందులో భాగంగా నియోజకవర్గానికి 4 నూతన 108వాహనాలు కేటాయించారు. వాటిని జూపాడుబంగ్లా, కొత్తపల్లి, పాములపాడు, పగిడ్యాల మండలాలకు కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. నూతనంగా మంజూరైన 108వాహనాల్లో ప్రథమచికిత్సకు అవసరమైన పల్స్ ఆక్సీమీటర్, గ్లూకోమీటర్, ఆక్సిజన్, మానిటర్ వంటి ఆధునిక సౌకర్యాలున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని సైతం ఆసుపత్రికి చేర్చేంత వరకు ప్రాణాలు నిలబెట్టగలిగే ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

పాములపాడుకు చేరుకున్న నూతన 108 వాహనం

పాములపాడు:స్థానిక పీహెచ్‌సీకి నూతన 108 వాహనం వచ్చిందని డాక్టర్ నాగలక్ష్మి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 4 సంవత్సరాల నుంచి 108 వాహనం ఉందని, పాత పడటంతో ప్రభుత్వం కొత్త వాహనం కేటాయించిందన్నారు.

ముస్లింలకు పెద్ద పీట



మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీఅబ్దుల్ షుకూర్

పాములపాడు: వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో ముస్లింలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ షుకూర్ అన్నారు. బుధవారం మండలంలోని మసీదులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మసీదుల్లో విధులు నిర్వహిస్తున్న ఇమామ్, మౌజన్‌లకు ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనం సక్రమంగా అందుతుందా, మసీదుల మరమ్మతులు, వాటి నిర్వహణ తదితర అంశాలపై ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆదేశాల మేరకు పరిశీలించినట్లు తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్షావలి, తిరుపతయ్య, వికలాంగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కేవీజీవీఎమ్ నిర్వాహకులు సింధు

ఆత్మకూరు: పట్టణంలోని చక్రం హోటల్ సమీపంలో బుధవారం ఆహార భద్రతా ప్రమాణాలపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో కేవీజీవీఎమ్ నిర్వాహకులు సింధు, ఉమ్మడి జిల్లాల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు రాముడు, ఖాజావలి మాట్లాడుతూ ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని హోటల్స్, కిరాణా దుకాణాలు, ఇతర తినుబండారాలు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తప్పనిసరిగా ఫుడ్‌సేఫ్టీ సూపర్‌వైజర్ ట్రైనింగ్ సర్టిఫికెట్లను కలిగి ఉండాలన్నారు. ఆహారం నాసిరకంగా తయారు చేస్తే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో కేవీజీవీఎమ్ నిర్వాహకులు మోహన్‌బాబు, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు అశోక్, శివశంకర్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం



క్రీడా కిట్లను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్(కోటా)లో ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామగ్రిని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలో రాణించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాభివృద్ధి అనేక మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. నంద్యాల, కర్నూలు జిల్లాల శాప్ కో ఆర్డినేటర్లు రవికుమార్, శ్రీనాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు క్రిష్ణవేణి, లాలు, సురేష్, రవూఫ్, జెడ్పీటీసీలు కలీమున్నిసా, సుధాకర్ రెడ్డి, జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల పక్షం

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- కాకనూరులో ట్యాంకు నిర్మాణానికి రూ.32లక్షలు మంజూరు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



కాకనూరులో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండి ఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలో సర్పంచ్ నర్ల సులోచనమ్మ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ను వివరించారు. సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు.

ట్యాంకు నిర్మాణానికి రూ.32లక్షలు..

కాకనూరులో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు వాటర్‌ట్యాంకు నిర్మాణం చేస్తామని, జలజీవన్ మిషన్ ద్వారా రూ. 32లక్షలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. గ్రామంలో పర్యటిస్తుండగా పారిశుద్ధ్యం లోపం చూసిన వెంటనే మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి రూ. 35వేలు ఆర్థిక సాయం

ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ముంతల వంశీకృష్ణకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ. 20వేలు, గ్రామ సీనియర్ నేత కాకనూరు పరమేశ్వరరెడ్డి రూ. 10వేలు, నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సాయం అందించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ముడిమెల పుల్లారెడ్డి, నర్ల మహేశ్వరరెడ్డి, రామగోపాల్‌రెడ్డి, ఏపీఎస్పీ డీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, గొర్రెలపెంపకం దారుల సంఘం డైరెక్టర్ సుబ్బయ్యయాదవ్ పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

మిడుతూరు: మండలపరిధిలోని తలముడిపి గ్రామానికి చెదిన తెలుగు మధుశేఖర్ (37) ఉపాధి పనికి వెళ్లి పనిప్రదేశంలో గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణం సహాయం కింద మృతుని భార్య నామిని మాధవికి రూ . 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అక్బర్, పంచాయతీ కార్యదర్శి శాలుబాష పాల్గొన్నారు. అలాగే మాసపేట గ్రామంలోని రమిజాబీ అనే మహిళ సహజంగా మరణించారు. వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ. 10 వేలను నామినీ హుసేన్ బీకి జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి అందజేశారు. నాయకులు కమతం ఎల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి, అన్వర్ బాషా పాల్గొన్నారు.

కాలానుగుణంగా పనులు కల్పించాలి

కొత్తపల్లి: ఉపాధి కూలీలకు కాలానుగుణంగా గ్రామాలలో పనులు కల్పించాలని ఏపీఓ రేష్మ సూచించారు. బుధవారం సిబ్బందితో స్థానిక ఉపాధి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు కాలానుగుణంగా ఏఏ పనులు కల్పించాలో ఎస్టీమేషన్ వేసి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా వారంలోగా హార్టీకల్చర్ పనులను పూర్తి చేయాలని సూచించారు.

విద్యార్థులకు మార్గనిర్దేశకుడు ఉపాధ్యాయుడు



పదవీ విరమణ పొందిన చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: విద్యార్థులకు మార్గనిర్దేశకుడు ఉపాధ్యాయుడని, వారిని సన్మార్గంలో నడిపించినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు, ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ గురుకులాల ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ వివరమణ పొందిన చంద్రశేఖర్‌కు పాఠశాలలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప, పలువురు ఉపాధ్యాయులు చంద్రశేఖర్ సేవలను కొనియాడారు. అనంతరం శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రెటరీ కంబయ్య, ఉపాధ్యాయులు దామోదర్, ఇస్మాయిల్, సోమశేఖర్, మునయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయండి

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని ఎస్సీ,ఎస్టీ గిరిజన పాఠశాల, హాస్టల్‌లో 60 మందికి పైగా బాలికలు ఉన్నా.. టీచర్లు లేరని ఆ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని కొమరం భీం గిరిజన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఆశీర్వాదం, సభ్యులు కోరారు. బుధవారం హాస్టల్‌ను సందర్శించి, పిల్లలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొట్టాలచెరువు, ఎర్రమటం, చిన్నారుట్ల, మేకలబండ, లింగాలగట్టు, హఠకేశ్వరం ,సున్నిపెంట, కొత్తపేట గ్రామాల నుంచి పిల్లలు వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారని చెప్పారు. 60 నుంచి 80 మంది వరకు ఉన్న విద్యార్థులకు ఒక హెడ్‌మాస్టర్, ఒక టీచర్ మాత్రమే ఉన్నారన్నారు. 6,7,8 తరగతులకు అసలు టీచర్లే లేకపోవడం వలన కేవలం పుస్తక పఠనం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య స్టేట్ ప్రెసిడెంట్ బద్దె నాయక్, జెండాలమ్మ, రాజు, వీరయ్య పాల్గొన్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు దృష్టి సారించి అవసరం అయిన ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

నల్లమలలో భారీ వర్షం

- పొంగిన భవనాసి, సిద్ధవాగులు
- పంటపొలాలు జలమయం
- వెలుగోడులో నీట మునిగిన కాలనీలు



గువ్వలకుంట్ల సమీపంలో పొలాలలో నీటిని బయటికి పంపేందుకు కాల్వలు తీస్తున్న రైతన్న

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, నల్లమల అటవీ పరిధిలో, ఆత్మకూరులో బుధవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు ఈ వర్షం 77.8 మి.మీ గా నమోదైనట్లు చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ఇంత వరకు ఈ స్థాయిలో భారీ వర్షం కురవలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచిన అరకొర వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆత్మకూరు పట్టణంలో 20 శాతం మించి కూడ రైతులు విత్తు వేయలేని దుస్థితి ఇప్పటి వరకు నెలకొంది. కాగా , నేడు కురిసిన ఈ భారీ వర్షం వలన ఇప్పటికే చదును చేసిన రైతులు విత్తు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. నల్లమలలో కురిసిన ఈ వర్షానికి భవనాసి, సిద్ధవాగులు పొంగి ప్రవహించాయి. పొలాల్లో వర్షపు నీరు చేరింది. బుధవారం సాయంత్రం కూడ ఆత్మకూరు మండలంలోని కొన్ని గ్రామాలతో పాటు రోళ్లపెంట, బైర్లూటి నల్లమల అటవీపరిధిలో కూడ ఓ మోస్తరు వర్షం కురిసింది.

వెలుగోడు జలమయం

వెలుగోడు: పట్టణంలో భారీ వర్షం కురవడంతో పలు కాలనీలు నీట మునిగాయి. పట్టణంలోని గండిపేట, సీపీ నగర్, ద్వారకానగర్, లక్ష్మీ నగర్, వెంగల్‌రెడ్డి పేటలో గృహాల్లోకి నీరు చేరాయి. ఎమ్మెల్యే శిల్పా ఆదేశాలతో ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, యూత్ నాయకుడు షంషీర్ అలీ, రామ్మోహన్‌రెడ్డి లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. ఇళ్లలోని నీరు చేరుకున్న గృహాలకు సందర్శించి వారికి ధైర్యాన్ని చెప్పి ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఇండియన్ పెట్రోల్ బంక్ దగ్గర వర్షపు నీరు ఎక్కువ నిలవడంతో సర్పంచ్ జయపాల్ స్పందించి వెంటనే జేసీబీని పిలిపించి కాలువను తవ్వి సమస్యకు పరిష్కారం చూపారు. మండలంలో 92.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెప్పారు.

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి పలు దఫాలుగా ఓ మోస్తరు వర్షం కురిసింది. నల్లమల అడవిలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు నిండగా బండిఆత్మకూరు మండలం కాకనూరు సమీపంలోని కుందూ కాల్వలో నీరు భారీగా చేరింది.

విస్తారంగా వర్షాలు

నందికొట్కూరు: నియోజకవర్గంలో మంగళవారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పంట భూముల్లోకి నీరు చేరింది. బుధవారం ఉదయం 6 గంటల వరకు, మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది.



ఆత్మకూరు సమీపంలో పంటపొలాల్లో నిలిచిన వర్షపునీరు

కొత్తపల్లి మండలంలో 103.8 మి.మీల వర్షం

కొత్తపల్లి: మండలంలోని లింగాపురం, శివపురం, సింగరాజుపల్లె, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, కపిలేశ్వరం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, బావాపురం, గువ్వలకుంట్ల, వీరాపురం గ్రామాలతోపాటుగా కొత్తపల్లి మండల కేంద్రంలో 103.8 మి.మీల వర్షపాతం నమోదు అయినట్లు ఏఎస్ఓ రాజ్‌పాల్ బుధవారం తెలిపారు. భారీవర్షంతో పంటలు నీటమునిగాయి.

రాత్రంతా వర్షమే..

పాములపాడు: ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు ఈ నెల 4న రాత్రి 10.30గంటల నుంచి ప్రారంభమైన వర్షం రాత్రంతా కురుస్తూనే ఉంది. వర్షపాతం 76.8మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు.

జూపాడుబంగ్లాలో 26.8మిల్లీమీటర్లు

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 26.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. కొత్తపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదుకాగా, మిడుతూరు మండలంలో అత్యల్పంగా 5.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు తెలిపారు. పగిడ్యాలలో 19.6ఎం,ఎం, నందికొట్కూరులో 9.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.



వెలుగోడు ద్వారకా నగర్‌లో ఇంట్లోకి చేరిన నీటిని తోడిస్తున్న దృశ్యం



నిర్వాసితులకు భోజనం పెడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యువతి అదృశ్యం

మహానంది: బుక్కాపురం గ్రామానికి చెందిన 21ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన సుమలత గత నెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి సన్నమయ్య ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇంటర్ వరకు చదివి, టైలరింగ్ నేర్చుకుంటున్న యువతి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు బంధువులు, తెలిసినవారి వద్ద వెతికారన్నారు. అయినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు.కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామన్నారు.

గురుకులాల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: కర్నూలు ఉమ్మడి జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 11 గురుకుల పాఠశాలల్లో రిజర్వేషన్ ప్రాతిపదికన 6 నుంచి తొమ్మిది తరగతుల వరకు 74సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆయా సీట్ల భర్తీకి ఈనెల 7వతేదీ సాయంత్రంలోగా పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 8న ఉదయం ఆయా పాఠశాలల్లో ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.

నందికొట్కూరు: 2023-24 విద్యా సంవత్సరానికి లక్ష్మాపురం అంచె వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకట రమణమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.